## సర్వేయర్లుగా వీఆర్వోలను నియమిస్తారా?

- అవగాహన లేనివారిని నియమిస్తే సమస్యలు
- ప్రభుత్వం పునరాలోచించాలని సర్వేయర్ల డిమాండ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 27: అవగాహన లేని వారిని సర్వేయర్లుగా నియమిస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు చేస్తామని ప్రభుత్వ సర్వేయర్లు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న సర్వేయర్లు శుక్రవారం జిల్లా కేం ద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూమాత అమలుపై, సర్వేఅండ్ ల్యాం డ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో నూతనంగా చేపట్టనున్న నియామకాలపైనా చర్చ జరిగింది. తెలంగాణ గెజిటెడ్ అసోసియేష న్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ.. సర్వేయర్లను నియమిస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. గతంలో పనిచేసిన వీఆర్వోలకు అవకాశం కల్పిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడంపై అభ్యంతరం తెలిపారు. ఎలాంటి టెక్నికల్ నాలెడ్జ్ లేని వా రిని నియమిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ప్రభుత్వం భూసమస్యలు లేకుండా చేస్తానని చెబుతూనే, కొత్త సమస్యలు సృష్టించడం సరికాదని చెప్పారు. కర్ణాటకలో చేపట్టిన విధానాన్ని ఇక్కడా అమలు చేస్తామనడం సరికాదన్నారు.


## పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు లేదు

**ఎన్‌ఎస్‌యూఐ నేత నిరంజన్‌బాబా**

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి సముచిత స్థానం లేదని ఎండీ నిరంజన్ బాబా శుక్రవారం తీవ్ర మనస్తాపంతో మీడియా ముందు ఆవేదన వెలిబుచ్చారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా, జిల్లా , యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా .. పార్టీ అభివృద్ధి కోసం 18 ఏండ్లుగా పనిచేసినా ఎలాంటి పదవి లభించలేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్టీ పదవులకు అర్హులం కాదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేయని నాయకులకు పదవులు వస్తున్నాయని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. వనపర్తి కోర్టులో న్యాయవాదిగా చాలాకాలంగా పనిచేస్తున్నా.. కోర్టులో అదనపు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏజీపీ) పదవి ఆశించినా తనకు దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్టు చెప్పారు.

# మళ్లీ వీఆర్వో వ్యవస్థ!

మొదటిపేజీ తరువాయి...




ఇచ్చినోళ్లకే పనయ్యేది. పేద రైతులు పదులసార్లు ప్రదక్షిణలు చేసినా పట్టించుకోని పరిస్థితి. రైతులకు ఈ దుస్థితిని దూరం చేసేందుకు 2020లో నాటి కేసీఆర్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. గ్రామ రెవెన్యూ అధికారులను ఇతర ప్రభుత్వ శాఖల్లోకి సర్దుబాటు చేసింది. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఆ నాటి నుంచి రైతులపై, భూములపై వీఆర్వోల అజమాయిషీ లేదు. కంప్యూటర్‌లో ఒక్కసారి భూమి వివరాలు నమోదైతే మార్చే ప్రసక్తే లేదు. ఫలితంగా రైతుల్లో భరోసా పెరిగింది. కానీ.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వీఆర్వో వ్యవస్థను తెరమీదకి తెచ్చింది. భూభారతి చట్టం ద్వారా ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమించనున్నది. పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే మళ్లీ రెవెన్యూ శాఖకు తీసుకొచ్చి వీఆర్వోలుగా నియమిస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. మళ్లీ రాత్రికి రాత్రే తమ తలరాతలు ఎక్కడ మారిపోతాయో అని భయపడుతున్నారు.

### రాత్రికి రాత్రే రికార్డులు తారుమారు

గతంలో మ్యానువల్ పద్ధతిలో భూ రికార్డుల నిర్వహణ జరిగినప్పుడు వీఆర్వో రాసిందే రాత.. గీసిందే గీత అన్నట్టుగా సాగేది. లంచం ఇచ్చినవాళ్లకు, పైరవీలు చేసుకున్నవాళ్లకు రికార్డుల్లో కాస్తు కాలమ్‌లో పేర్లు నమోదయ్యేవి. ఆ తర్వాత వారినే యజమానులుగా మార్చి పట్టాలు మంజూరు చేసేవారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు 1995లో తండ్రి నుంచి వారసత్వంగా చెరో 2.03 ఎకరాల భూమి వచ్చింది. 2000 సంవత్సరంలో తమ్ముడి భూమిని అన్న కొనుగోలు చేశాడు. రికార్డుల్లో పేరు మార్చాలని వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు రూ.5 వేలు లంచం డిమాండ్ చేయగా.. ఆ రైతు ఇవ్వలేదు. 2018లో భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ఆ రైతు పేరుమీద 4.06 ఎకరాలకు బదులు 0.3 గుంటల భూమి మాత్రమే ఉన్నది. దీంతో ఆ రైతు లబోదిబోమన్నాడు. లంచం అడిగితే ఇవ్వలేదని వీఆర్వో తన భూమిని వేరే వ్యక్తుల పేర్లమీదికి మార్చాడని ఆరోపించారు. 'పొరబాటున ఆ భూమి వేరే రైతు పేరుమీదికి మారింది' అంటూ ఆ వీఆర్వో చావుకబురు చల్లగా చెప్పాడు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఏదైనా అత్యవసరమై రైతులు తమ భూమిని అమ్ముకోవాలని చూసినప్పుడు రికార్డులు తారుమారైన ఘటనలు వెలుగులోకి వచ్చేవి. దీంతో మళ్లీ అదే వీఆర్వోకు అడిగినంత ముట్టజెప్పి, పై అధికారుల కాళ్లావేళ్లా పడి అడిగినంత సమర్పించుకొని పట్టా మార్పించుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా రికార్డులు మారకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు ప్రయత్నించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. పట్టా భూములే కాకుండా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంలో వీఆర్వోలు కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. రైతులు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులు అన్ని వర్గాల భూ యజమానులు వీఆర్వోల బాధితులే.

### మళ్లీ పాత వీఆర్వోలకు పిలుపు


కాంగ్రెస్ ప్రభుత్వం 2020 ఆర్వోఆర్ చట్టాన్ని రద్దు చేసి, కొత్తగా భూభారతి బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ప్రతి గ్రామానికి ఒక వీఆర్వోను నియమించనున్నారు. వీరికి మళ్లీ భూ రికార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. అందుకోసం కొత్త నియామకాలు చేపట్టకుండా పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇప్పటికే ఆప్షన్లు కూడా తీసుకుంటున్నారు. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. తమ భూములపై మళ్లీ వీఆర్వోల పెత్తనం మొదలవుతుందని, పాత రోజులు మళ్లీ వస్తాయని బిక్కుబిక్కు మంటున్నారు.

### విచ్చలవిడి అవినీతికి కేరాఫ్

వీఆర్వో వ్యవస్థ గతంలో విచ్చలవిడి అవినీతికి కేరాఫ్‌గా ఉండేది. డబ్బులు ఇస్తేనే పెన్ను ముట్టే పరిస్థితి. క్రయవిక్రయాలు నమోదు కావాలన్నా, 1బీ కావాలన్నా, పాస్‌బుక్ రావాలన్నా.. ఇలా ఏ పని అయినా లంచం ఇవ్వాల్సిందే. ఏ పనికి ఎంత అన్నది ఫిక్స్ చేసేవారు. 'పాస్‌బుక్ ఇవ్వాలంటే ఒక్కో రైతు రూ.లక్ష ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేస్తున్నాడు' అంటూ 2019లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి రైతులు తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని ఓ వీఆర్వో కొత్త పాస్‌బుక్‌లు, పట్టామార్పిడి కోసం రైతుల నుంచి భారీగా వసూళ్లు చేశాడు. ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత దాదాపు 10 నెలలపాటు పత్తాలేకుండా పోయాడు. దీనిపై బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ప్రతి రైతుకు ఒక అనుభవమే. ఒకప్పుడు ఏసీబీ నమోదు చేసిన కేసుల్లో రెవెన్యూ శాఖ టాప్‌లో ఉండగా, పట్టుబడినవారిలో ఉన్నతాధికారులతో సమానంగా వీఆర్వోలు ఉండేవారు. వారి వద్ద రూ.కోట్లలో అక్రమాస్తులు బయటపడేవి.

### రద్దుతో సంబరం

వీఆర్వో వ్యవస్థ చేస్తున్న దారుణాలను గమనించిన కేసీఆర్ ప్రభుత్వం 2020లో సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంబరాలు చేసుకున్నారు. తమ భూములపై ఇతర వ్యక్తుల పెత్తనం పోయిందని ఆనందపడ్డారు. 2020లో తెచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో రికార్డులు కంప్యూటర్‌లోకి వెళ్లాయి. భూ క్రయవిక్రయాలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగాయి. రికార్డులు సరళతరం అయ్యాయి. దీంతో గ్రామాల్లో భూ రికార్డుల నిర్వహణ అవసరం లేకుండా పోయింది. వీఆర్వోలకు పనిలేకుండా పోయింది. అందుకే ఆ వ్యవస్థను రద్దు చేశామని నాటి సీఎం కేసీఆర్ చెప్పారు.



నాగర్‌కర్నూల్ జిల్లా నేరళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,

## మర్రిని పరామర్శించిన సంతోష్

- జంగిరెడ్డి చిత్రపటం వద్ద మాజీ ఎంపీ నివాళి

తిమ్మాజిపేట, డిసెంబర్ 27 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన మర్రి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మలోతు కవిత మర్రిని పరామర్శించారు.

## వీఆర్వోలు, వీఆర్ఏలు నాట్ విల్లింగ్!

- వెనక్కి వచ్చేందుకు నేటితో ముగియనున్న గడువు
- సర్వీస్ రూల్స్ లేకపోవడంతో తర్జన భర్జన

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): గ్రామాల్లో కొత్తగా వీఆర్వోలుగా పనిచేసేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని రెవెన్యూవర్గాలు చెప్తున్నాయి. ఇతర శాఖల్లో పనిచేస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి వచ్చేందుకు విల్లింగ్ ఇవ్వాలని సీసీఎల్ఏ ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ గడువు శనివారంతో ముగియనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 10,434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి ఒక వీఆర్వోను నియమించాలని, మరో వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 11,500 మందిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తేవాలని భావించింది. గతంలో ఇతర శాఖల్లోకి సర్దుబాటు అయిన వీఆర్వోలు, వీఆర్ఏలు కలిపి దాదాపు 24 వేల మంది వరకు ఉన్నారు. దీంతో కుప్పలుతెప్పలుగా దరఖాస్తులొస్తాయని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వం అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పటివరకు 3,500 మంది వరకు మాత్రమే విల్లింగ్ ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. నూతన వీఆర్వో వ్యవస్థకు సంబంధించి సర్వీస్ రూల్స్ నిర్ధారణ కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. 'ముందు చేరండి.. ఆ తర్వాత బాధ్యతలు, సర్వీస్ నిబంధనలు తెలుస్తాయి' అంటూ ఉన్నతాధికారులు చెప్తున్నారట. అసలు తమ పని ఏమిటో తెలియకుండా ఎందుకు వెళ్లాలని పాత వీఆర్వోలు, వీఆర్ఏలు భావిస్తున్నారు. పైగా గతంలో కన్నా అధికారాలు తక్కువగా ఉండటం కూడా మరో కారణంగా చెప్తున్నారు. విద్యార్హతలు వంటి సాంకేతిక అడ్డంకులు ఉండటంతో సర్వేయర్ పోస్టులో చేరేందుకు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.



అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు, అధికారులు

## జోగుళాంబ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

అలంపూర్, డిసెంబర్ 27 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జి ఎస్వీఎన్ భట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ స్వాగతం పలికి, జోగుళాంబ జ్ఞాపికను అందజేశారు. వారి వెంట గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, తాసీల్దార్ మంజుల ఉన్నారు.

## ఈ ఏడాది 41 రోజులు భారీ ఎండలు

వాషింగ్టన్, డిసెంబర్ 27: ఈ ఏడాది ఎండలు మండిపోయాయని.. వాతావరణ మార్పుల వల్ల సగటున 41 రోజులు అదనంగా ఎండలను భరించాల్సి వచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న వాతావరణ మార్పులపై పరిశోధన చేసిన సైంటిస్టులు గత అధ్యయనాల ఆధారంగా ఈ విషయాలను వెల్లడించారు. 'ఈ పరిణామం ఆశ్చర్యం కలిగించకపోయినా ఆందోళనకరం. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజల జీవితాలు, జీవనోపాధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి' అని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ అండ్ యాన్ ఇంపీరియల్ కాలేజ్ వాతావరణ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ ఒట్టో అన్నారు.

## నేటి నుంచి టీజీబీ సేవలు బంద్

ఉట్నూర్, డిసెంబర్27: నేటి నుంచి నాలుగు రోజులపాటు తెలంగాణ దక్కణ్ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిచిపోనున్నాయని హస్నాపూర్ మేనేజర్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చెందిన గ్రామీణ వికాస్ బ్యాంకు తెలంగాణలోని శాఖలు దక్కణ్ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్న నేపథ్యంలో ఈ నెల 31వరకు బ్యాంక్ సేవలు, యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, సీఎస్‌పీ సెంటర్లు పూర్తిగా పని చేయవని తెలిపారు. జనవరి ఒకటో తేదీన నుంచి యథావిధిగా పని చేస్తాయని, ఖాతాదారులు గమనించి సహకరించాలన్నారు.

దస్తురాబాద్, డిసెంబర్ 27: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) అన్ని శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంక్ సేవలు పని చేయవని టీజీబీ మేనేజర్ నరేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. జనవరి 1వ తేదీ నుంచి బ్యాంక్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

## విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్27: అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి1న నిర్వహించే 206వ భీమా కోరేగావ్ విజయోత్సవ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా పార్టీల నేతలతో కలిసి అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ నాయకులు భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమానికి చెందిన పోస్టర్లు విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన బహుజనులు అధిక సంఖ్యలో తరలిచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ పీఏసీసీ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దిలీప్ మోరే, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మిర్జా జిలానీబేగ్, ఎండీ మసుద్, బీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ సందీప్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, మండల కోశాధికారి సునీల్, నాయకులు మస్కే రాజ్‌వర్ధన్, శివాజీ, జహీర్, దూద్‌రాం, మారుతి, తదితరులు ఉన్నారు.



సోన్ మండల కేంద్రంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

## వరి నాట్లు షురూ

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- బిజీబిజీగా రైతులు

*సోన్, డిసెంబర్ 27: మండలంలో వరి నాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో రైతులు ఇప్పటికే వరి నార్లు పోసుకోగా.. ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. ట్రాక్టర్లతో దమ్ము చేసి వరి నారును మహిళలు నాట్లు వేస్తుండటంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు.*

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 27: నాయుడువాడకు చెందిన వంశీకృష్ణ ఈ నెల 24 న నిద్రమాత్రలు మింగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడగా.. గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వంశీ కృష్ణ పట్టణంలోని ఓ నర్సింగ్‌హోమ్‌లో పార్ట్‌నర్‌గా ఉన్నాడు. ఇందుకోసం రూ.4.50లక్షలు పెట్టుబడి పెట్టాడు. పార్ట్‌నర్ల మధ్య గొడవలు రావడంతో జీవితంపై విరక్తి చెంది 24న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, నిజామాబాద్ దవాఖానలో చికి త్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్ తెలిపారు.

# అధ్వానం.. శంకర్‌పల్లి మార్గం

- కంకరతేలిన రోడ్డుతో ప్రమాదకరంగా ప్రయాణం
- అవస్థలుపడుతున్న వాహనదారులు, గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు
- తారురోడ్డు నిర్మించాలని వేడుకుంటున్న ప్రజలు

***మందమర్రి** మండలంలోని శంకర్‌పల్లికి రోడ్డు అధ్వానంగా తయారైంది. సరైన దారి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కంకర తేలి, చిత్తడిగా మారడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. బైకులపై వెళ్లేవారు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలూ ఉండగా, గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మించాలని గ్రామం ముక్తకంఠంతో కోరుతున్నది.*



కంకరతేలి అధ్వానంగా మారిన శంకర్‌పల్లి రోడ్డు

మందమర్రి, డిసెంబర్ 27 : సరైన రోడ్డు సౌకర్యం లేక మండల పరిధిలోని శంకర్‌పల్లి గ్రామ ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని సండ్రోన్‌పల్లి మీదుగా శంకర్‌పల్లి వరకు నిర్మించిన రోడ్డు.. కంకర తేలి అధ్వాన్నంగా తయారవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామప్రజలు వివిధ అవసరాలపై నిత్యం ఈ రహదారి గుండానే మండల కేంద్రమైన మందమర్రికి వచ్చి వెళ్తుంటారు. ఇతర దూర ప్రాంతాలకు వెళ్లేందుకూ ఈ రహదారే దిక్కు అని అంటున్నారు. అంతేకాకుండా ఏరియాలోని బొగ్గు గనుల్లో పనిచేసే సింగరేణి కార్మికులు ఈ రోడ్డు గుండానే వెళ్లి వస్తుంటారు. రోడ్డుపై తీవ్రంగా కంకర తేలి గుంతలు ఏర్పడటంతో తరుచూ తమ వాహనాలు చెడిపోతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైకులపై వెళ్లే క్రమంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలూ ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. పూర్తిస్థాయిలో తారురోడ్డు నిర్మించాలని పలుమార్లు కోరినా సంబంధిత ప్రభుత్వ, సింగరేణి అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సింగరేణి, ప్రభుత్వ అధికారులు తమ ఇబ్బందులను గ్రహించి, శంకర్‌పల్లి వరకు తారురోడ్డు నిర్మించి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

# మెరుగైన వైద్యసేవలందించాలి

- రక్తహీనత లేని సమాజాన్ని నిర్మిద్దాం
- జిల్లా వైద్యాధికారి రాజేందర్
- చించోలి(బి)లో హెచ్‌బీ మాక్‌డ్రిల్ పరీక్షల పరిశీలన



రక్తహీనత పరీక్షలను పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్

సారంగాపూర్, డిసెంబర్ 27: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు. శుక్రవారం చించోలి(బి)లో నిర్వహించిన హెచ్‌బీ మాక్‌డ్రిల్ పరీక్షలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. సమాజంలో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి కాపాడాల్సిన బాధ్యత ఆరోగ్యశాఖపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి రక్తహీనత పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత పరికరాలు స్ట్రిప్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గతంలో గర్భిణులకు మాత్రమే రక్తహీనత పరీక్షలు నిర్వహించే వారమని, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాను రక్తహీనత రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడ జిల్లా మాస్ మీడియా అధికారి బారే రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్ గౌడ్, మొహిన్‌అలీ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## 31 నుంచి కొనుగోళ్లు ప్రారంభం

జైనథ్/బేల, డిసెంబర్ 27: జైనథ్, బేల మార్కెట్ పరిధిలోని బేల మార్కెట్ ఆవరణలో ఈ నెల 31 నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగో లు ప్రారంభంకానున్నట్లు మార్కెట్ కార్యదర్శి కాంబ్లే మధుకర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి మొక్క నాణ్యత ప్రమాణాలు తగ్గినందున బీబీ ఎంవోడీ నుంచి బీబీ స్పెషల్‌కు మారిందన్నారు. 8 శాతం తేమ శాతం ఉన్న పత్తి క్వింటాల్‌కు రూ.7,471కి సీసీఐ చెల్లి స్తుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అలాగే వాతావరణ మార్పుల కారణంగా సీసీఐ ఆధ్వర్యంలో చేపడు తున్న పత్తి కొనుగోళ్లను ఈ నెల 28న నిలిపివేస్తున్నట్లు సీసీఐ సీపీవో సుధీర్ పేర్కొన్నారు. తిరిగి ఈనెల 31న కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభిస్తామని, రైతులు ఈ విషయాన్ని గమనించి సూచించారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బోథ్, డిసెంబర్ 27: మెరుగైన విద్యు త్ సరఫరా కోసం బోథ్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్నట్లు ట్రాన్స్‌కో సీఈ జయవంత్ రావ్‌చౌహన్ తెలిపారు. శుక్రవారం బోథ్‌లోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం చేస్తున్న గద్దె పనులను పరిశీలించారు. రైతులు మోటర్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఈ వెంట ఎంఆర్టీ డీఈ ప్రభాకర్, ఏడీఈ లక్ష్మణ్, ఎస్ఎల్ఐ ప్రవీణ్, ఎల్ఐ సావ్లా, సిబ్బంది ఉన్నారు.

### విలీన సభకు పెద్ద ఎత్తున హాజరవ్వాలి

ఖానాపూర్, డిసెంబర్ 27: హైదరాబాద్‌లో శనివారం జరగబోయే న్యూ డెమోక్రసీ విప్లవ పార్టీల విలీన సభకు పెద్ద ఎత్తు హాజరై విజయవంతం చేయాలని సీపీఐఎం న్యూ డెమోక్రసీ నాయకులు కోరారు. ఈ క్రమంలో శుక్రవారం వారు పట్టణంలోని విశ్రాంతి భవనంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఇక్కడ ఖానాపూర్ డివిజన్ సీపీఐఎం న్యూడెమోక్రసీ కార్యదర్శి సునారికారి రాజేశ్, నాయకులు రాజేశ్, స్వామి, ప్రసాద్, లింగన్న తదితరులు ఉన్నారు.

### డిప్యుటేషన్లు రద్దు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 27: కేజీబీవీలో డిప్యుటేషన్లు రద్దు చేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సీపీఎస్ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయినులకు కేజీబీవీలకు ఇన్‌చార్జి ఎస్‌వోలుగా నియమిస్తూ ఇచ్చిన డిప్యూటేషన్లు రద్దు చేయాలన్నారు ఇలా చేయడం వల్ల ఇటు పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం ఏర్పడుతుందని, అటు అనుభవం లేనటువంటి వ్యవస్థలో పనిచేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఆలోచన విరమించుకోవాలన్నారు.

### సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, డిసెంబర్27: సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు వంశీ పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ ఎదుట సీఆర్టీల రిలే దీక్షలో ఆయన పాల్గొని, మట్లాడారు. తమ దీక్షతో గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. శనివారం ఐటీడీఏ కేంద్రం ఎదుట వంటావార్పుతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

### 29న రౌండ్ టేబుల్ సమావేశం

ఎదులాపురం, డిసెంబర్ 27: సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 10:30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించ నున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూరౌండ్ టేబుల్ సమావేశం ఉటుందన్నారు. సామాజిక, కార్మి క, కర్షక, విద్యార్థి యువజన సంఘాల నాయకులు సమావేశానికి హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

### జయప్రదం చేయాలి

ఎదులాపురం, డిసెంబర్27: ఆదిలాబాద్ పట్టణంలోని భూక్తాపూర్‌లో మహాప్రజ్ఞా బుద్ధవిహార్‌లో జనవరి ఒకటిన నిర్వహించే 206వ బీమాకోరేగావ్ శౌర్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సమతా సైనిక్‌దళ్ జాతీయ కన్వీనర్ గౌరవ దిగంబర్‌కాంబ్లే పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మహాప్రజ్ఞా బుద్ధ విహార్ సమావేశాన్ని నిర్వహించగా, జాతీయ కన్వీనర్ గౌరవ దిగంబర కాం బ్లే, ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గౌతమ బుద్ధు డి, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలు, మహాత్మా జ్యోతిబాపూలే, అంబేద్కర్, సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇక్కడ మహా ప్రజ్ఞ బుద్ధ విహార్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు రత్నజాడే ఉదయ్‌కుమార్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జిల్లా యూత్ అధ్యక్షుడు మస్కే రాజు, ఉపాధ్యక్షుడు పటాడే రాజు, సెక్రటరీ సూకదేవే హరీశ్, ఈశ్వర్, సూకదేవ్ ఉన్నారు.